తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 09- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 35 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in


### గ్రీన్ గ్రోత్ సమ్మిట్‌లో అంతర్జాతీయ ప్రతినిధులతో

# సీఎం రేవంత్ భేటీ



- తెలంగాణలో పెట్టుబడులపై విస్తృత చర్చలు
- గ్రీన్ ఎకానమీ, కృత్రిమ మేధ, మౌలిక సదుపాయాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలకు తెలంగాణ సిద్ధమని సీఎం స్పష్టం

2లో

# వైఎస్ రాజశేఖరరెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి

- జయంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి
- వైఎస్ సేవలను స్మరించిన ముఖ్యమంత్రి
- మంత్రులు, ప్రజాప్రతినిధుల నివాళులు

2లో



# కెనడాతో తెలంగాణ బంధాలకు కొత్త ఊపు

- కెనడా హైకమిషనర్‌తో సీఎం రేవంత్ రెడ్డి విస్తృత చర్చలు
- వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, ఆవిష్కరణల్లో భాగస్వామ్యంపై దృష్టి
- కెనడా పర్యటనకు ముఖ్యమంత్రికి ఆహ్వానం
- మూసీ అభివృద్ధి, ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణపై కెనడా ఆసక్తి



2లో

### బొగ్గు బ్లాక్ కేటాయింపు

# రాష్ట్రానికి శుభపరిణామం

340 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం

మరో 40 ఏళ్లపాటు సింగరేణి కార్యకలాపాలకు భరోసా

ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కృతజ్ఞతలు

2లో



# మంత్రి ఫిర్యాదుపై స్పందించిన కడియం

- దేవాదాయ శాఖపై అధికారిక సమీక్ష నిర్వహించలేదని స్పష్టం
- నియోజకవర్గ ఆలయాల సమస్యల పరిష్కారానికే అధికారులను కలిశానని వివరణ
- వివాదాలకు దూరంగా ప్రోటోకాల్ ప్రకారమే వ్యవహరిస్తానని వ్యాఖ్య



**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ తనపై మంత్రి కొండా సురేఖ చేసిన ఫిర్యాదుపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అందువల్ల ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ ప్రభుత్వ నిబంధనలు, ప్రోటోకాల్‌కు అనుగుణంగానే వ్యవహరిస్తానని తెలిపారు. దేవాదాయ శాఖపై అధికారిక సమీక్ష నిర్వహించే అధికారం తనకు లేదనే విషయం తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. తన నియోజకవర్గంలోని ఆలయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం మాత్రమే

మిగతా 2లో



# రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్‌లో నూతన బస్‌స్టేషన్‌కు శంకుస్థాపన

- నాగర్‌కర్నూల్–వనపర్తి మధ్య కొత్త ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం
- జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు
- ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చామని మంత్రి పొన్నం

7లో




# గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి

- విద్యార్థుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఆదేశాలు
- ఆహార నాణ్యత, మౌలిక సదుపాయాలపై సమగ్ర పరిశీలన

7లో

# పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు : పొంగులేటి

- ర్యాలంపాడు పునరావాస గ్రామంలో గృహప్రవేశాలు
- అర్హులందరికీ విడతల వారీగా ఇళ్ల మంజూరు
- మహిళా సంఘాలకు రూ.5.74 కోట్ల రుణాల పంపిణీ



**జోగులాంబ గద్వాల, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ధరూర్ మండలం ర్యాలంపాడు పునరావాస గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని, రెండో విడతలోనూ అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

మిగతా 7లో

# పది రూపాయల నాణేలతో బైక్ కొనుగోలు

- రూ.1.10 లక్షల విలువైన బైక్‌కు నాణేలతోనే చెల్లింపు
- ఓపికగా లెక్కించి వాహనం అందజేసిన షోరూమ్ సిబ్బంది
- యాదాద్రి జిల్లాలో ఆసక్తికర ఘటన వైరల్

**యాదాద్రి భువనగిరి, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఓ వ్యక్తి పది రూపాయల నాణేలతో కొత్త ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. చిట్యాల మండల కేంద్రంలోని ఓ ద్విచక్ర వాహనాల షోరూమ్‌లో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం

మిగతా 2లో



### కాళేశ్వరం అంశంపై

# హరీశ్‌రావును నిలదీసిన జగ్గారెడ్డి

- ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై సమాధానం చెప్పాలని డిమాండ్
- అసెంబ్లీలో చర్చకు రావాలని ప్రతిపక్షానికి సవాల్
- తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టాలని పిలుపు



7లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# వైఎస్ రాజశేఖరరెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి నివాళి

**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్ సేవలను స్మరించుకుంటూ ఆయన ప్రజా సంక్షేమానికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలన అందించిన నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పేదలు, రైతులు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అమలు చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు.

కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, లోక్‌సభ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని వైఎస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

జయంతి సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్‌కు నివాళులర్పించే కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టి ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను స్మరించుకున్నారు. ప్రజా సంక్షేమమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొంటూ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## బొగ్గు బ్లాక్ కేటాయింపు
# రాష్ట్రానికి శుభపరిణామం

**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థకు తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయించడం తెలంగాణ రాష్ట్రానికి శుభపరిణామమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లుగా చేసిన నిరంతర కృషి ఫలితంగానే ఈ బొగ్గు బ్లాక్ సింగరేణికి లభించిందని పేర్కొన్నారు. ఈ కేటాయింపుతో సంస్థ భవిష్యత్ మరింత బలోపేతం కానుందని ఆయన అభిప్రాయపడ్డారు. తాడిచర్ల2 బొగ్గు బ్లాక్ ద్వారా సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో సింగరేణి సంస్థ మరో 40 సంవత్సరాల పాటు మైనింగ్ కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించే అవకాశం కలుగుతుందని చెప్పారు. ఇది రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ బొగ్గు బ్లాక్ కేటాయింపుతో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లో సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఊతమిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి తాడిచర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయాలంటే మిగిలిన బొగ్గు బ్లాకులను కూడా సంస్థకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని భట్టి విక్రమార్క కోరారు. సింగరేణి బలోపేతం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, వేలాది కార్మిక కుటుంబాల సంక్షేమానికి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తి పెంపుతో పాటు సంస్థ విస్తరణకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతూ సింగరేణిని మరింత శక్తివంతమైన ప్రభుత్వ రంగ సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## గ్రీన్ గ్రోత్ సమ్మిట్‌లో
# అంతర్జాతీయ ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో జరుగుతున్న గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ -2026 సందర్భంగా ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు బుధవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, గ్రీన్ ఎకానమీ, భవిష్యత్ సాంకేతికతలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.



ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో మలేషియా పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ ఎం. శరవణన్, అమెరికాకు చెందిన బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ బోర్డు డైరెక్టర్ నిలి గిల్బర్ట్, అమెరికా వాణిజ్య శాఖ మూమెంటమ్ టెక్నాలజీస్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహేష్ కొండూరు, ఓక్సన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫ్యూచర్ కౌన్సిల్ కోచైర్ అమిత్ మెహ్రా, నార్వే ప్రభుత్వ మాజీ స్టేట్ సెక్రటరీ, ఓషన్ హౌస్ గ్లోబల్ స్ట్రాటజీస్ సలహాదారు దిలెక్ అయహన్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు థామస్ ప్రోలిక్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు సెంథిల్ తొండమాన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎకానమీ, అధునాతన సాంకేతిక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీ, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, పునరుత్పాదక ఇంధన వనరులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో తెలంగాణ చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి ప్రతినిధి బృందానికి వివరించారు. భవిష్యత్ తరాలకు అనుకూలమైన అభివృద్ధి నమూనాను రూపొందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కృత్రిమ మేధ, డిజిటల్ పరివర్తన, డేటా సెంటర్లు, ఫిన్‌టెక్, గ్రీన్ టెక్నాలజీ, పరిశ్రమల ఆధునీకరణ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌ల ప్రోత్సాహం వంటి అంశాలపై కూడా విస్తృత చర్చ జరిగింది. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా తెలంగాణలో అత్యాధునిక సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించేందుకు అవకాశాలను పరిశీలించారు. అంతర్జాతీయ ప్రతినిధులు తెలంగాణలో నెలకొన్న పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక విధానాలు, వేగవంతమైన నిర్ణయ ప్రక్రియపై ప్రశంసలు వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమావేశంలో గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ నిర్వహిస్తున్న మెరీడియన్ కలెక్టివ్ ప్రతినిధులు రిత్వికా భట్టాచార్య, ఉమా భట్టాచార్య, లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రానికి మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులు తీసుకురావడం, ఉపాధి అవకాశాలు పెంచడం, సుస్థిర అభివృద్ధి దిశగా తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కెనడాతో తెలంగాణ బంధాలకు కొత్త ఊపు

**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత విస్తరించే దిశగా మరో కీలక అడుగు పడింది. కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలు, విద్య, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశం ద్వారా కెనడా-తెలంగాణ సంబంధాలు మరింత బలోపేతం అయ్యే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న అనుకూల వాతావరణం, వేగవంతమైన అనుమతుల విధానం, అత్యాధునిక మౌలిక సదుపాయాలపై ముఖ్యమంత్రి వివరించారు. సమాచార సాంకేతికం, జీవ విజ్ఞాన శాస్త్రాలు, రక్షణ, ఏరోస్పేస్, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని వివరించారు. ప్రపంచంలోని ప్రముఖ ఫార్చ్యూన్-500 కంపెనీలు హైదరాబాద్‌ను తమ గ్లోబల్ కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై కెనడా హైకమిషనర్ ప్రత్యేక ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో కెనడా సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, పట్టణాభివృద్ధి నైపుణ్యాన్ని వినియోగించుకునే అవకాశాలపై చర్చించారు. ముఖ్యంగా మూసీ ప్రాజెక్టును సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అవకాశాల కలయికగా ప్రభుత్వం రూపొందిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ లక్ష్యాలను సాధించేందుకు కెనడా భాగస్వామ్యాన్ని కోరిన ముఖ్యమంత్రి, సోలార్ విద్యుదుత్పత్తి, గ్రీన్ ఎనర్జీ, వాతావరణ అనుకూల అభివృద్ధి కార్యక్రమాల్లో కలిసి పనిచేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎకానమీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు.

విద్యా రంగంలో కూడా ఇరు ప్రాంతాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలన్న అంశం సమావేశంలో ప్రాధాన్యం పొందింది. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల కన్సార్టియం ద్వారా హైదరాబాద్‌లో బహుళ విశ్వవిద్యాలయాల సముదాయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీని ద్వారా పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులపై కెనడా సంస్థలు పెరుగుతున్న విశ్వాసాన్ని హైకమిషనర్ ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ తయారీ యూనిట్ ఏర్పాటు, సీఐబీసీ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ప్రారంభం, సీటీఆర్ఎల్ఎస్ డేటా సెంటర్లలో సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ ఒక బిలియన్ కెనడియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా పర్యటనకు హైకమిషనర్ ఆహ్వానించారు. ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో కెనడా పర్యటించి ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలతో సమావేశమవ్వాలని కోరారు. ఈ పర్యటన ద్వారా ఇరు ప్రాంతాల మధ్య సంస్థాగత, వ్యాపార భాగస్వామ్యాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో ఎడిషన్‌కు కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, ఆవిష్కరణ సంస్థలు పెద్దఎత్తున పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. రాష్ట్రంలో అధిక వృద్ధి అవకాశాలు ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న దూరదృష్టి పాలన, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, ఉపాధి కల్పనకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని కెనడా హైకమిషనర్ ప్రశంసించారు. ప్రతిభావంతమైన మానవ వనరులు, బలమైన ఆవిష్కరణ వ్యవస్థ తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చాయని పేర్కొన్నారు. త్వరలో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణను సందర్శించి ఇంధనం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ శశాంక, ఐటీఈఅండ్‌సీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో తెలంగాణ-కెనడా మధ్య సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు, ఆర్థిక పురోగతి, ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి సంకల్పాన్ని ఇరువర్గాలు పునరుద్ఘాటించాయి.

# మంత్రి ఫిర్యాదుపై స్పందించిన కడియం

(మొదటి పేజీ తరువాయి)

శాఖ కమిషనర్, సంబంధిత అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులను కలిశానని చెప్పారు. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష సమావేశం నిర్వహించలేదని వివరించారు. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి అవసరమైన పనులు, నిధుల అంశాలపై మాత్రమే చర్చించినట్లు కడియం శ్రీహరి తెలిపారు. దేవాదాయ శాఖ వద్ద నిధుల కొరత ఉందని అధికారులు చెప్పడంతో అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని కోరినట్లు వెల్లడించారు. తనపై వచ్చిన ఆరోపణలు అవగాహన లోపం వల్లే వచ్చాయని కడియం శ్రీహరి అభి



ప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను కలవడం తన బాధ్యతలో భాగమేనని అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం అవసరమైతే మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసి నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కొందరు నాయకులు అనవసర వివాదాలు సృష్టించి వార్తల్లో నిలవాలని ప్రయత్నిస్తున్నారని కడియం శ్రీహరి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, రాజకీయ వివాదాల కంటే అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. మంత్రి కొండా సురేఖ తనపై చేసిన ఫిర్యాదుపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని గౌరవిస్తానని కడియం శ్రీహరి పేర్కొన్నారు. తాను ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని మరోసారి స్పష్టం చేస్తూ, ప్రజల అభ్యున్నతి కోసం తన కృషి కొనసాగుతుందని అన్నారు.

# పది రూపాయల నాణేలతో బైక్ కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన కొండ రఘుపతి స్థానిక శ్రీ వినాయక మోటార్స్‌లో హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేశారు. వాహనం ధర సుమారు రూ.1.10 లక్షలు కాగా, మొత్తం నగదును పది రూపాయల నాణేల రూపంలోనే చెల్లించారు. ఇందుకోసం తాను చాలాకాలంగా పొదుపు చేసిన నాణేలను బస్తాల్లో నింపి షోరూమ్‌కు తీసుకువచ్చారు. బస్తాల నిండా నాణేలు చూసిన షోరూమ్ సిబ్బంది తొలుత ఆశ్చర్యపోయారు. అనంతరం వాటిని ఓపికగా లెక్కించి మొత్తం సరిచూ



సుకున్నారు. చెల్లించిన మొత్తం సక్రమంగా ఉండటంతో వాహనాన్ని రఘుపతికి అందజేశారు. పది రూపాయల నాణేలు చట్టబద్ధమైన చెల్లింపుగా ఉండటంతో లావాదేవీ సజావుగా పూర్తైంది. ఈ సంఘటనను అక్కడున్న పలువురు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియోలు, ఫొటోలు వేగంగా వైరల్ అవుతున్నాయి. చిన్నచిన్న పొదుపులతో పెద్ద లక్ష్యాన్ని సాధించిన రఘుపతి పట్టుదలను పలువురు ప్రశంసిస్తున్నారు.

రోజువారీగా దాచుకున్న నాణేలతో తన కలల బైక్‌ను కొనుగోలు చేయడం ఎంతో ప్రేరణాత్మకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నగదు రూపం ఎలా ఉన్నా చట్టబద్ధమైన చెల్లింపులను స్వీకరించిన షోరూమ్ యాజమాన్యాన్ని కూడా అభినందిస్తున్నారు. ఈ ఘటన పొదుపు విలువను మరోసారి గుర్తు చేస్తోందని, చిన్న మొత్తాలుగా దాచిన డబ్బు కూడా భవిష్యత్తులో పెద్ద అవసరాలను తీర్చగలదని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ఆసక్తికర ఘటన సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీసింది.

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పెద్దమందడి విద్యార్థి ఎంపిక



**పెద్దమందడి,జూలై08(తెలంగాణ ముచ్చట్లు):** ఈ నెల 9, 10, 11 తేదీలలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ హాకీ పోటీలకు పెద్దమందడి గ్రామానికి చెందిన పదో తరగతి పూర్తి చేసిన పి. శివశంకర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న తెలిపారు. శారీరక విద్య ఉపాధ్యాయుడు మన్యం యాదవ్ ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శాంతన్న మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలలో శివశంకర్ ప్రతిభ కనబరిచి విజయం సాధించి రాష్ట్రానికి, జిల్లాకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివశంకర్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు మహేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ గంగమ్మ రవి, ఉపసర్పంచ్ ఉషన్న, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## గోదావరి జలాలు అందించిన మంత్రి తుమ్మలకు రైతుల పాలాభిషేకం




- **కల్లూరు మండల రైతుల హర్షం.**
- **సాగునీటి కల సాకారం చేశారంటూ కృతజ్ఞతలు.**

**సత్తుపల్లి, జూలై 8 (తెలంగాణ ముచ్చట్లు):** సీతారామ ప్రాజెక్టు ద్వారా మోటార్లు ప్రారంభించి రాజీవ్ లింక్ కెనాల్ మార్గంగా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌తో పాటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించిన సందర్భంగా కల్లూరు మండల రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాగునీటి కలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాకారం చేశారని కొనియాడారు. గోదావరి జలాలు తమ పొలాలకు చేరేలా కృషి చేసిన మంత్రికి రైతాంగం ఎప్పటికీ రుణపడి ఉంటుందని అన్నారు. సాగునీరు అందడంతో పంటల సాగు విస్తరిస్తుందని, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా రైతులు స్వచ్ఛందంగా పాల్గొని పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

## జన విజ్ఞాన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం



**వేలేరు, జులై 08 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలంలో జన విజ్ఞాన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని సభ్యత్వం నమోదు చేసుకున్నారు. జన విజ్ఞాన వేదిక చేపడుతున్న సామాజిక, విద్యా, శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలకు మద్దతుగా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా గుడికందుల రమేష్ మాట్లాడుతూ, సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తోందన్నారు. యువత ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# చిన్న కాలువలను రద్దు చేయాలని రైతుల వినతి



**పెద్దమందడి,జూలై08(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జంగమాయపల్లి గ్రామంలో చిన్న కాలువల నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరుతూ గ్రామ రైతులు సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలో అధిక శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని, ప్రతి రైతుకు స్వల్ప విస్తీర్ణంలోనే సాగుభూమి ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో రైతుల భూముల మధ్యగా చిన్న కాలువలను ఏర్పాటు చేస్తే ఇప్పటికే తక్కువగా ఉన్న భూమి మరింత తగ్గిపోతుందని, దీంతో రైతుల జీవనోపాధి దెబ్బతినడంతో పాటు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే బసిరెడ్డి చెరువుకు నీరు చేరినప్పుడు ఇప్పటికే ఉన్న తూములు, కాలువల ద్వారానే ప్రతి ఎకరానికి సాగునీరు అందుతోందని, కొత్తగా ప్రతిపాదించిన చిన్న కాలువల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గ్రామ రైతులందరూ సమావేశమై ఏకగ్రీవంగా చిన్న కాలువల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేసినట్లు తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత చిన్న కాలువల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సూపరింటెండింగ్ ఇంజనీర్‌ను వినతిపత్రం ద్వారా కోరారు.

# రెండు కుటుంబాలను పరామర్శించిన మంత్రి తుమ్మల

- **మందలపల్లిలో అడపా పుష్పావతికి నివాళులు.**
- **పట్వారిగూడెంలో చెలికాని రంగారావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి.**





**దమ్మపేట, జూలై 8 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సాయంత్రం దమ్మపేట మండలంలోని మందలపల్లి, పట్వారిగూడెం గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన ఇద్దరి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మందలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు అడపా లచ్చయ్య దొర తల్లి స్వర్గీయ అడపా పుష్పావతి ఇటీవల కన్నుమూయడంతో మంత్రి తుమ్మల వారి నివాసానికి వెళ్లి పుష్పావతి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆ తర్వాత పట్వారిగూడెం గ్రామానికి చేరుకున్న మంత్రి తుమ్మల, ఇటీవల మృతిచెందిన స్వర్గీయ చెలికాని రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజకీయ జీవిత ప్రారంభం నుంచి తనతో కలిసి నడిచిన రంగారావు సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో తాను భాగస్వామినని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో దమ్మపేట, అశ్వరావుపేట మండలాల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.






# జమ్మికుంటలో హోటళ్లకు హెచ్చరిక.. నాణ్యత, పరిశుభ్రతపై రాజీ లేదు

- **ప్లాస్టిక్ రహిత జమ్మికుంటకు సహకరించండి.**

**జమ్మికుంట టౌన్ జూలై 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా ప్రతి హోటల్, రెస్టారెంట్, కర్రీ పాయింట్ యజమాని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పిలుపునిచ్చారు. బుధవారం జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్ల యజమానులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జమ్మికుంట పట్టణం చుట్టుపక్కల గ్రామాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండటంతో పాటు రైల్వే, బస్సు రవాణా, వ్యవసాయ మార్కెట్ వంటి సౌకర్యాల కారణంగా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణానికి వస్తుంటారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఆహార విక్రయ కేంద్రాలు పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జూట్ బ్యాగులను ప్రోత్సహించాలని, వినియోగదారుల్లో కూడా అవగాహన కల్పించాలని కోరారు. అలాగే అన్ని వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకుని మున్సిపల్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బోళ్ళ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# 24వ వార్డులో ఎస్ఐఆర్ ఫారమ్‌పై ఇంటింటా అవగాహన

- **బీజేపీ నేత రాజేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచారం**



**జమ్మికుంట టౌన్ జూలై 08 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా 24వ వార్డులోని 175వ బూత్ పరిధిలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాజేష్‌ఠాకూర్ ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు సరిగా నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటరి పాత్ర కీలకమని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బూత్ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గురువారం - 09 - జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

## కొరపల్లిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు



**జమ్మికుంట టౌన్ జులై 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరంనేని పరుశరామ్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ప్రజాసేవను, సంక్షేమ పాలనను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట స్వప్న, గిరవేన శ్రీనివాస్ యాదవ్, దొగ్గల భాస్కర్, పింగిలి రాకేష్, పింగిలి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడిగ శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాచపల్లి సాగర్, బిజిగిరి శ్రీకాంత్, కొరపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పోల్సాని సాగర్ రావు, కొండు బిక్షపతి, బండారి శ్రీధర్, పుల్లూరు రవి, మేకల కొమరయ్య, కనకం కుమార్, పుల్లూరు సంపత్, పుల్లూరి సమ్మయ్య, కుమార్, రామచంద్ర, సమ్మయ్య, మహేష్‌తో పాటు జమ్మికుంట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ నాయకుల యోగక్షేమాలు తెలుసుకున్న ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని



**హుజురాబాద్, జూలై 8(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమమే పార్టీ బలోపేతానికి పునాది అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ప్రణవ్ బాబు గారు పేర్కొన్నారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు గారితో కలిసి ఆయన హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు మేకల తిరుపతి గారిని, వార్డు అధ్యక్షులు మోతే కుమారస్వామి గారిని పరామర్శించారు.

ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజా సేవలో, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయ సహకారాల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు చేస్తున్న సేవలు అమూల్యమని ప్రణవ్ బాబు అన్నారు. ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేయడంలో టౌన్ అధ్యక్షులు మేకల తిరుపతి, వార్డు అధ్యక్షులు మోతే కుమారస్వామి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య పరస్పర ఆప్యాయత, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తల సంక్షేమానికి కాంగ్రెస్ కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న నాయకులు త్వరగా కోలుకుని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ వారికి ధైర్యం చెప్పారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నాయకుల పరామర్శతో మేకల తిరుపతి, మోతే కుమారస్వామి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి: మిల్కూరి వాసుదేవరెడ్డి



**జమ్మికుంట టౌన్ జూలై 08 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి విస్తృత ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జమ్మికుంటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కూలీల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించిన ఆయన, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా మూడో డిస్కంను తీసుకురావడం ప్రజా వ్యతిరేక చర్య అని ఆరోపించారు. భవిష్యత్తులో రైతులకు ఉచిత విద్యుత్‌కు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన విధానాలపైనా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూరియా యాప్‌ను రద్దు చేయాలని, వరి వంగడాల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. ప్రాసెసింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరిన ఆయన, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతతో పాటు మౌలిక సదుపాయాల లేమి కారణంగా పేదలు ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రభుత్వ విద్యా, వైద్య సేవలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా, వైద్య సంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని తీసుకురావాలని కూడా కోరారు. జమ్మికుంట పట్టణంలోని పలు కాలనీల్లో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత పాలకులు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. నాయిని చెరువు సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, హౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్, మండల కమిటీ సభ్యులు బాసిర సంపత్‌రావు, దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, రావుల ఓదెలు, క్రాంతికుమార్, మధునయ్య పాల్గొన్నారు.

# డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా ఘన నివాళులు

- **మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు**




**హుజురాబాద్, జూలై 8(తెలంగాణ ముచ్చట్లు ):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా హుజురాబాద్‌లో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, రైతులు, విద్యార్థులు, పేదలు, మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేతగా వైఎస్సార్‌ను కొనియాడారు.

అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి వైఎస్సార్‌కు నివాళులర్పించి ఆయన ఆశయాలను స్మరించుకున్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు



**వేలేరు, జులై 08 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రజానేత కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను వేలేరు మండలంలో ఘనంగా నిర్వహించారు. వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ ప్రతి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న నాయకుడిగా కడియం శ్రీహరి ప్రజల ఆదరణ పొందారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బిల్ల యాదగిరి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఎల్కతుర్తి కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు

- **ఏకపక్ష నియామకాలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**



**ఎల్కతుర్తి, జూలై 8 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని ది విశాల సహకార బ్యాంకు నూతన పాలకవర్గంలో నామినేటెడ్ సొసైటీ డైరెక్టర్ పదవుల నియామకాలపై కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. పార్టీ కోసం ప్రతిపక్షంలో ఉన్న సమయంలో దాదాపు తొమ్మిదేళ్ల పాటు కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి కొందరికే పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

స్థానిక నాయకులను, గ్రామాల ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా ఏకపక్షంగా నియామకాలు చేపడుతున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లో పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు తదితర ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పదవులు భర్తీ చేయడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది.

మండలంలో నియమితులవుతున్న వ్యక్తుల రాజకీయ నేపథ్యం, పార్టీ కోసం చేసిన సేవలు, అర్హతలను పరిగణనలోకి తీసుకోకుండా నామినేషన్లు జరుగుతున్నాయని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీంతో పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా శ్రమించిన నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

నియామకాలను తాత్కాలికంగా నిలిపివేసి సంబంధిత గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించి, ఏకాభిప్రాయం మేరకు అర్హులైన పార్టీ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ వ్యవహారంపై చొరవ తీసుకుని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.





# నారు సిద్ధం, నీటి కోసం నిరీక్షణ.. వర్షాభావంతో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకం

*అన్నదాతల్లో పెరుగుతున్న ఆందోళన*

**హుజూరాబాద్, జూలై 8(తెలంగాణ ముచ్చట్లు ):** వానాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు నారుమడుల్లో పచ్చగా కళకళలాడుతున్న వరి నారు నాటేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు పొలాల్లో నీరు లేక నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. ఆకాశంలో మేఘాలు కనిపిస్తున్నా వర్షం మాత్రం కురవకపోవడంతో రైతుల ఆశలు రోజురోజుకూ ఆవిరవుతున్నాయి.

కొద్ది రోజుల క్రితం కురిసిన స్వల్ప వర్షాలను నమ్ముకుని రైతులు పొలాలను దున్నించి, నారుమడులు సిద్ధం చేసి విత్తనాలు చల్లారు. ప్రస్తుతం నారు నాటే దశకు చేరుకుంది. అయితే తదుపరి వర్షాలు కురవకపోవడంతో పొలాల్లో నీరు నిలవలేదు. దీంతో నారు సిద్ధంగా ఉన్నా నాట్లు ప్రారంభించలేక రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్ దున్నింపు, కూలీల ఖర్చులతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. కానీ వర్షాభావం కారణంగా ఆ పెట్టుబడులు వృథా అవుతాయేమోననే భయం వారిని వెంటాడుతోంది. నారు ఎక్కువ రోజులు మడిలోనే ఉంటే ముదిరిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం అనేక పొలాలు దున్ని సిద్ధంగా ఉన్నప్పటికీ నీరు లేక బీడుగా కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల స్వల్పంగా నిలిచిన నీరు కూడా ఎండ వేడికి త్వరగా ఆవిరైపోతోంది. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండకపోవడంతో బోర్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. అయితే భూగర్భ జలాలు కూడా తగ్గిపోవడంతో బోర్లు సైతం ఆశించిన మేరకు నీటిని అందించలేకపోతున్నాయి.

వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగు షెడ్యూల్ పూర్తిగా దెబ్బతింటోంది. సమయానికి నాట్లు వేయకపోతే పంట ఎదుగుదలపై ప్రభావం పడటమే కాకుండా దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో ఈ సీజన్ ఎలా ఉంటుందోనన్న ఆందోళన రైతు కుటుంబాల్లో నెలకొంది.

వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడటంతో రైతుల చూపులన్నీ ఇప్పుడు ఆకాశం వైపే ఉన్నాయి. త్వరలోనే విస్తారంగా వర్షాలు కురిసి పొలాలు నీటితో నిండాలని, నాట్లు ప్రారంభించి ఖరీఫ్ సాగును విజయవంతంగా పూర్తి చేయాలని అన్నదాతలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. మంచి వర్షాలు కురిస్తేనే రైతుల కష్టాలకు ఫలితం దక్కుతుందని, లేకపోతే ఈ సీజన్ మరోసారి తీవ్ర ఇబ్బందులను మిగిల్చే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కుట్రలు ఆపాలి

- **బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్**




**ఎల్కతుర్తి, జూలై 8 (తెలంగాణ ముచ్చట్లు):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కుట్రలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రే లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎల్కతుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనల వల్ల గ్రామీణ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించగా, ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పనిదినాలు తగ్గి గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధి కూలీకి పనిలో కొలతతో సంబంధం లేకుండా రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే నిర్ణయాలను ఉపసంహరించుకుని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, దేశంలో ముడి చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలను కూడా తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జూపాక రవీందర్, ఎర్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతే మోసాల నివారణకు అసలైన ఆయుధం

**సీఐ పులి రమేష్**



**ఎల్కతుర్తి, జూలై 8( తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసాలను అరికట్టడం సాధ్యమవుతుందని, అప్రమత్తతే మోసాల నివారణకు అసలైన ఆయుధమని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ అన్నారు.

మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొందరు వ్యక్తులు కార్లలో గ్రామాలకు వచ్చి సాధువుల వేషధారణలో ఇళ్ల వద్దకు చేరుకుని "పూజలు చేస్తాం", "మీ కోరికలు తీరుస్తాం", "దోష నివారణ చేస్తాం" అంటూ ఇళ్లలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇటువంటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, అపరిచితులకు ఇళ్లలోకి ప్రవేశం కల్పించవద్దని సూచించారు. పూజల పేరుతో ప్రజలను మోసం చేసే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమ గ్రామాల్లో లేదా పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు సంచరిస్తున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు ఇతర ప్రాంతాలకు చెందినవైనా కావచ్చని, వాటిని చూసి ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సీఐ పులి రమేష్ విజ్ఞప్తి చేశారు.




## బల్దియా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ట్రైబల్ నాయకులు

**వరంగల్,జులై08(తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తేజావత్ వెంకన్న నాయక్‌ను ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లావుడియా రాజు నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని బహుకరించి సన్మానించారు. కమిషనర్‌గా వెంకన్న నాయక్ సమర్థవంతమైన సేవలు అందించి, గ్రేటర్ వరంగల్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. అలాగే భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని అభినందనలు తెలియజేశారు.

## మంత్రి సీతక్కను కలిసిన తిప్పర్తి శ్రీధర్



**మహబూబాబాద్,జులై08(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితుడైన తిప్పర్తి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క, తిప్పర్తి శ్రీధర్‌కు కొత్త బాధ్యతల సందర్భంగా అభినందనలు తెలియజేసి, పార్టీ ఎస్సీ విభాగాన్ని జిల్లా స్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శేషం కిరణ్, శ్రీనివాస్, పడిశాల విక్టర్ తదితరులు పాల్గొన్నారు.



## మహ్మద్ హుస్సేన్‌పల్లిలో ఎస్ఐఆర్ ప్రారంభం

**మూసాపేట్,జూలై08(తెలంగాణ ముచ్చట్లు)::** వనపర్తి జిల్లా మూసాపేట్ మండలం మహ్మద్ హుస్సేన్‌పల్లి గ్రామంలో ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా 32వ బూత్ పరిధిలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఎన్యుమరేషన్ ఫారాల నింపివేత కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఏ-2గా మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఎం. దేవన్న యాదవ్, బీఎల్ఓ పద్మతో కలిసి ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను నింపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎం. దేవన్న యాదవ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైందని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను నింపుతూ ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ఫారాలను సక్రమంగా నింపే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, గ్రామస్తులందరూ ఈ కార్యక్రమానికి సహకరించి తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మూసాపేట్ మండల ఆర్ఐ రవిశంకర్, జూనియర్ అసిస్టెంట్ అంజన, గ్రామపంచాయతీ కార్యదర్శి శైలజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ముఖ్యనాథస్వామి ఆలయ అభివృద్ధికి రూ.1.10 కోట్లు మంజూరు

**ధర్మసాగర్,జులై08(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలోని ప్రాచీన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయ అభివృద్ధికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.10 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఆలయ పునఃవ్యవస్థాపకుడు శివసాని ప్రవీణ్ రవీంద్ర చేసిన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న మంత్రి నివాసంలో శివసాని ప్రవీణ్ రవీంద్రకు మంజూరు ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యనాథస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు శివసాని ప్రవీణ్ రవీంద్ర ఆలయ జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ ప్రజాప్రతినిధులు గడ్డం రాజేందర్, పెద్ది శ్రీనివాస్, ఆలయ పునఃవ్యవస్థాపకుడు శివసాని ప్రవీణ్ రవీంద్ర, ఉపాధ్యక్షుడు మోడెం రవి, ఎర్ర చేరాలు, ప్రధాన కార్యదర్శి దారపు చంద్రయ్య, ఉప కార్యదర్శులు మర్రిపల్లి రాజు, సులుగూరి రాజు, పారుపల్లి రవిత, కుమ్మం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు జాబితా శుద్ధీకరణలో భాగస్వాములు కావాలి

- **రాజకీయ పార్టీలతో జిల్లా కలెక్టర్ సమీక్ష**
- **ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలీకరణ వేగవంతం**
- **ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యమన్న కలెక్టర్**

**ఖమ్మం, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు, బూత్ స్థాయి అధికారులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తూ, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని దాదాపు అన్ని ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ పూర్తయిందని, ప్రస్తుతం వాటిని తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలీకరణ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై పూర్తి సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు ఇంటి వద్ద అందుబాటులో ఉండి తమ వివరాలను సక్రమంగా అందించడం ద్వారా ఓటరు జాబితా శుద్ధీకరణలో సహకరించాలని సూచించారు. అన్‌మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా లేదా వివరాల్లో పొరపాట్లు ఉన్నా వెంటనే అభ్యంతరాలు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ సంబంధిత పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితానే పునాదని కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. జిల్లాలో అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజల సహకారంతో విజయవంతంగా పూర్తి చేయాలని రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బందికి పిలుపునిచ్చారు.

# జనప్రియ టౌన్‌షిప్‌లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శ్రీకారం

- **రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు**
- **డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**
- **శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ టౌన్‌షిప్‌లో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి పనులను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జనప్రియ టౌన్‌షిప్‌తో పాటు పరిసర కాలనీల ప్రజలు అనేక సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఈ బాక్స్ డ్రైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షపు నీటి పారుదల వ్యవస్థ మెరుగుపడి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జనప్రియ టౌన్‌షిప్ నివాసితులు, పరిసర కాలనీల ప్రజలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

- **ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలతో సమావేశం**
- **98.96 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి**
- **బీఎల్‌వోలకు బీఎల్‌ఏలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ పిలుపు**



**ములుగు, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. బుధవారం తన ఛాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 98.96 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, అలాగే 25.79 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు.

ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు, ఓటర్ల నుంచి ఫారాలను తిరిగి స్వీకరించే ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ కార్యక్రమంలో భాగస్వామి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే జిల్లా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. సమన్వయంతో పనిచేస్తే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయవచ్చని అన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఖచ్చితమైన ఓటరు జాబితా అత్యంత కీలకమని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పిలుపునిచ్చారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల సహకారం అవసరం

- **జగిత్యాలలో పారిశుద్ధ్య చర్యలను పరిశీలించిన కలెక్టర్**
- **దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశం**
- **ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు సిద్ధంగా ఉంచాలని సూచన**

**జగిత్యాల, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జగిత్యాల మున్సిపాలిటీ ఎనిమిదో వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రై డే నిర్వహణ, యాంటీ లార్వా చర్యలు, జ్వరాల సర్వేలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ అధికారులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని పరిశీలించిన కలెక్టర్, పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా మందులు పిచికారీ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వినియోగాన్ని విస్తృతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులను పరిసరాల పరిశుభ్రత ద్వారానే సమర్థవంతంగా నివారించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటికి "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం" అనే సందేశం చేరేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా పరిశుభ్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వర్షాకాలంలో జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహాతోనే చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరాల సర్వేలను నిరంతరం నిర్వహించి అనుమానిత కేసులను వెంటనే గుర్తించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాదని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పేర్కొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు



- ఆందోల్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న హరీశ్‌రావు
- కేసీఆర్ నాయకత్వంలోనే మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- ఓటరు జాబితా సవరణపై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచన

**సంగారెడ్డి, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం, పార్టీ సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అవగాహన సదస్సులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగకుండా ప్రజా సమస్యలు, పాలనపై మాట్లాడాలని హరీశ్‌రావు సూచించారు. ప్రజలకు వాస్తవాలు పూర్తిగా అర్థమయ్యాయని, రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆందోల్ ప్రాంతానికి కీలకమైన సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ఎందుకు నిలిపివేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలు తగ్గిన వెంటనే ఈ ప్రాజెక్టుల కోసం భారీ పాదయాత్ర నిర్వహిస్తామని ప్రకటించారు.

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని హరీశ్‌రావు సూచించారు. ప్రతి కుటుంబం తమ ఓటు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని, నిర్దేశిత గడువులోపు అవసరమైన ఫారాలు నింపి సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. పార్టీ కార్యకర్తలు ప్రతి ఓటును కాపాడే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన హరీశ్‌రావు, ప్రాజెక్టు పరిధిలో క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా, సాగునీటి విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

గురుకులాల టెండర్లు, కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఆయన, వాటిపై చర్చించేందుకు వెళ్లిన తమను పోలీసులు అడ్డుకోవడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ప్రజల మద్దతు బీఆర్ఎస్‌కే ఉందని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



## తుది దశకు చేరుకున్న నల్గొండ క్రాస్ రోడ్స్ ఫ్లైఓవర్

- రూ.690 కోట్లతో నిర్మాణ పనులు వేగవంతం
- ఆగస్టు తొలి వారంలో పూర్తి చేయాలని ఆదేశం
- ట్రాఫిక్ రద్దీ తగ్గి నగర రాకపోకలకు ఊరట





**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలోని నల్గొండ క్రాస్ రోడ్స్ వద్ద రూ.690 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భారీ ఫ్లైఓవర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఆగస్టు మొదటి వారంలోగా అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కమిషనర్ సూచించారు. మిగిలిన పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అవసరమైన యంత్రాంగం, సిబ్బంది సమన్వయం చేసుకుని వేగంగా పనులు చేపట్టాలని ఆదేశించారు.

ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మూసారాంబాగ్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని అధికారులు తెలిపారు. నగర తూర్పు ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు వేగవంతమైన రాకపోకలు సాధ్యమవడంతో ప్రయాణ సమయం కూడా తగ్గనుంది. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఫ్లైఓవర్‌పై క్రాష్ బారియర్ల ఏర్పాటు, ఆధునిక ఎల్ఈడీ వీధి దీపాల అమరిక చేపడుతున్నారు. ఫ్లైఓవర్ దిగువ భాగంలో ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం పెంపు, అందీకరణ పనులను కూడా సమాంతరంగా కొనసాగిస్తున్నారు.

నగర ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఈ ఫ్లైఓవర్ ఒకటిగా అధికారులు పేర్కొన్నారు. పనులు పూర్తయిన తర్వాత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టును నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి నగరవాసులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.





# పేదల ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు : పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు కొత్త సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేసి వారంలోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ చేశామని తెలిపారు. గద్వాల నియోజకవర్గంలోని పలు మండలాల్లో కొత్త తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులు చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. పునరావాస గ్రామాల్లో నివసిస్తున్న కుటుంబాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పక్కా గృహాల కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణంతో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతున్న నేపథ్యంలో నిర్వాసితుల త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. ర్యాలంపాడు పునరావాస గ్రామంలో 236 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పునరావాస గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయడంతో పాటు 62 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.5.74 కోట్ల విలువైన ఇందిర మహిళా శక్తి బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అంశంపై హరీశ్‌రావును నిలదీసిన జగ్గారెడ్డి




**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలపై ముందుగా సమాధానం చెప్పాలని, అనంతరం ప్రభుత్వంపై విమర్శలు చేయాలని హరీశ్‌రావును డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లోపాల కారణంగానే సమస్యలు తలెత్తాయని జగ్గారెడ్డి ఆరోపించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పరిణామాలకు బాధ్యత వహించాలని హరీశ్‌రావును కోరారు. ప్రాజెక్టు నాణ్యతపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ఆయనను అప్పట్లో ఆ శాఖ నుంచి ఎందుకు తప్పించారో ప్రజలకు వివరించాలని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై శాసనసభలో సమగ్ర చర్చకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను సభకు తీసుకువచ్చి వాస్తవాలపై చర్చించాలని సవాల్ విసిరారు. ప్రజల ముందు అన్ని అంశాలు స్పష్టమవుతాయని అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటి నిల్వపై జాతీయ డ్యామ్ భద్రతా ప్రాధికార సంస్థ సూచనల మేరకే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు. నీటిని నిల్వ చేయవద్దన్నది కేంద్ర ప్రభుత్వ సంస్థ అభిప్రాయమని, అది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాదని స్పష్టం చేశారు.

ప్రాజెక్టులో సాంకేతిక సమస్యలు ఉన్నాయని నిపుణులు సూచించిన నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం అంశంపై వాస్తవాలను ప్రజలకు వివరించాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. తప్పుడు ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని, ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

# రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్‌లో నూతన బస్‌స్టేషన్‌కు శంకుస్థాపన



**నాగర్‌కర్నూల్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ నూతన కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వసతి, భోజనం, విద్యా సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని, దీంతో సుమారు రూ.11,371 కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయ్యిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 10 వేల ఆర్టీసీ బస్సులు రోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం సంస్థను ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చిందని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల పెండింగ్ పీఆర్సీ అమలు, డీఏలు విడుదల, కారుణ్య నియామకాలు, కొత్త ఉద్యోగాల భర్తీ, కొత్త బస్సుల కొనుగోలు, తొలగించిన ఉద్యోగుల పునర్నియామకం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 375 రూట్లలో బస్సు సర్వీసులు ప్రారంభించి అదనంగా ఏడు లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరాన్ని బట్టి మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజా సంక్షేమం, రవాణా అభివృద్ధి, ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి



**నాగర్‌కర్నూల్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, ఆహార నాణ్యతపై మంత్రి సమగ్రంగా పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించి వారి విద్యా పురోగతిని మంత్రి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలని సూచించారు.

విద్యార్థులతో నేరుగా మాట్లాడిన మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్నానాలకు వేడి నీటి సౌకర్యం కల్పించాలని కోరడంతో పాఠశాలకు సోలార్ ప్లాంట్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, మెనూ అమలుపై మంత్రి ఆరా తీశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన వంట సరుకుల నాణ్యతను పరిశీలించి, నాణ్యమైన ఆహార పదార్థాలనే వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

వంటగదిలో తయారు చేస్తున్న ఆహారాన్ని పరిశీలించిన మంత్రి, వంటల్లో ఉపయోగిస్తున్న కూరగాయలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాజా కూరగాయలతోనే వంటలు సిద్ధం చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత శాఖల అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పోషకాహారం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కోస్గిలో అభివృద్ధి పనులపై సీఎం ప్రధాన కార్యదర్శి సమీక్ష

- రహదారులు, పాఠశాల, సైన్స్ మ్యూజియం పనుల పరిశీలన
- అమృత్ పథకం పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశం
- పాఠశాల ప్రహరీ, హరితహారం చేపట్టాలని సూచన



**నారాయణపేట, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్ బుధవారం కొడంగల్ నియోజకవర్గంలోని నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎన్. శ్రీధర్ ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. కోస్గి మున్సిపాలిటీ వద్ద జిల్లా కలెక్టర్ ప్రియాంక పూలమొక్క అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను పరిశీలించి, నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని సందర్శించిన ఎన్. శ్రీధర్, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కోస్గిలో నిర్మాణంలో ఉన్న సైన్స్ మ్యూజియం పనులను పరిశీలించిన ఆయన, నిర్మాణం ఎప్పటిలోగా పూర్తవుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం తరహాలో ఆధునిక సైన్స్ పరికరాలు, ప్రదర్శన వస్తువులు ఏర్పాటు చేసి విద్యార్థులకు విజ్ఞానాన్ని చేరువ చేయనున్నట్లు అధికారులు వివరించారు.

అమృత్ పథకం కింద నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ నీటి ట్యాంకు పనులను పరిశీలించిన ఎన్. శ్రీధర్, నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యం త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో ప్రజారోగ్య శాఖ అధికారులు, రహదారులు-భవనాల శాఖ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సర్వే శాఖ సూపరింటెండెంట్

- రూ.15 వేల లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- మహబూబ్‌నగర్ సర్వే, భూ రికార్డుల కార్యాలయంలో ఘటన
- న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలింపు



**మహబూబ్‌నగర్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకుడి కార్యాలయంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ బొమ్మిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ అధికారులు బుధవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన గ్రామానికి సంబంధించిన గ్రామ మ్యాప్‌లో సవరణలు చేపట్టేందుకు సంబంధిత ఫైల్‌ను సహాయ సంచాలకుడి వద్దకు పంపించేందుకు అధికారిక అనుకూలం చేస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి సూపరింటెండెంట్ రూ.15 వేల లంచం డిమాండ్ చేశారు.

ఫిర్యాదుదారుడి సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో బొమ్మిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.15 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులను నిజాయితీగా నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించి అక్రమ లబ్ధి పొందేందుకు లంచం స్వీకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేసి నాంపల్లిలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలంగాణ ఏసీబీ ప్రజలకు సూచించింది.

# తెలంగాణ రైతుల ప్రయోజనాలపై కేంద్ర మంత్రితో భేటీ

- వరి కొనుగోలు పెంపుపై వినతి
- అదనపు బియ్యం సేకరణకు చర్యలు కోరిన బీజేపీ నేతలు
- రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో రబీ 2025-26 సీజన్‌కు సంబంధించి వరి కొనుగోలు పరిమాణాన్ని పెంచడంతో పాటు అదనపు బియ్యం సేకరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి కోరారు. బుధవారం తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ, నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి ఈ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన కిషన్ రెడ్డి, రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి అవసరమైన మేర అదనపు బియ్యం సేకరణకు కూడా అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో వ్యవసాయ రంగం బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. రైతుల శ్రమకు తగిన గిట్టుబాటు లభించేలా కొనుగోలు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం, అభ్యున్నతే భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అన్నదాతల ప్రయోజనాల పరిరక్షణలో బీజేపీ ఎప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో కూడా రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

వరి కొనుగోలు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సమావేశంలో పాల్గొన్న బీజేపీ ప్రజాప్రతినిధులు కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎయిడ్స్ నియంత్రణలో వికారాబాద్‌కు జాతీయ గుర్తింపు

- జాతీయ స్థాయి ప్రశంసా పత్రం అందుకున్న జిల్లా
- ఎచ్ఐవీ గుర్తింపు, చికిత్సలో లక్ష్యాల సాధన
- దేశవ్యాప్తంగా ఎంపికైన 70 జిల్లాల్లో వికారాబాద్‌కు చోటు

**వికారాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఎచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, చికిత్స రంగంలో విశిష్ట పనితీరు కనబరిచినందుకు వికారాబాద్ జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా సాధించిన జిల్లాలకు అందించే ప్రశంసా పత్రాన్ని వికారాబాద్ జిల్లా అందుకుంది. దేశవ్యాప్తంగా ఈ గుర్తింపు పొందిన 70 జిల్లాల్లో వికారాబాద్ జిల్లా చోటు దక్కించుకుంది. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మార్గదర్శకత్వంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ నేతృత్వంలో వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ ఘనత సాధ్యమైందని అధికారులు తెలిపారు. హెచ్ఐవీ గుర్తింపు, చికిత్స, నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి జాతీయ స్థాయిలో నిర్దేశించిన ప్రమాణాలను చేరుకున్నట్లు వెల్లడించారు.

జాతీయ లక్ష్యాల్లో భాగంగా జిల్లాలో హెచ్ఐవీతో జీవిస్తున్న కనీసం 95 శాతం మందిని గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మొత్తం 4,536 మంది హెచ్ఐవీ బాధితులను గుర్తించి, వారందరికీ యాంటీ రెట్రోవైరల్ థెరపీ చికిత్స అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. చికిత్స నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రత్యేక



పర్యవేక్షణ చేపట్టింది. ఈ విజయానికి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏఆర్‌టీ కేంద్రాలు, ఐసీటీసీ పరీక్షా కేంద్రాలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు. ముందస్తు పరీక్షలు, వెంటనే చికిత్స ప్రారంభించడం, కౌన్సెలింగ్, నిరంతర ఫాలోఅప్ సేవలు అందించడం వల్ల లక్ష్యాలు సాధ్యమయ్యాయని వివరించారు.

హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు తీసుకోవడం ద్వారా వైరల్ లోడ్ గణనీయంగా తగ్గి ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని వైద్యులు సూచించారు. అలాగే ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు కూడా తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజలు హెచ్ఐవీపై ఉన్న అపోహలు, భయాలు, వివక్షను విడనాడి సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ఐసీటీసీ కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకుని అవసరమైతే వెంటనే చికిత్స ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ గుర్తింపుకు సహకరించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు.

# టీవీ షో పేరుతో మహిళపై సామూహిక అత్యాచారం

- అవకాశం కల్పిస్తామని నమ్మించి నిర్మానుష్య భవనానికి తీసుకెళ్లిన దుండగులు
- సికింద్రాబాద్‌లో అమానుష ఘటన
- ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని నమ్మించి ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై మహంకాళి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 43 ఏళ్ల మహిళ కుటుంబ కలహాల కారణంగా గత రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ తన కుమారుడితో జీవిస్తున్నారు. కుటుంబ సమస్యల పరిష్కారం కోసం ఓ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొనే ఉద్దేశంతో హైదరాబాద్‌కు వచ్చారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉన్న సమయంలో ఓ వ్యక్తి ఆమెకు పరిచయమై, టీవీ కార్యక్రమ నిర్వాహకులతో తనకు పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. అనంతరం రాణిగంజ్‌లోని హైదర్ కాంప్లెక్స్‌లో ఉన్న నిర్మానుష్య భవనానికి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత మరో వ్యక్తి అక్కడికి చేరుకుని మహిళపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

అనంతరం బాధితురాలు మహంకాళి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బాధితురాలికి అవసరమైన వైద్య, న్యాయ సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఐటీ శాఖ పనితీరుపై ప్రధాన కార్యదర్శి సమీక్ష

- ఐటీఈ అండ్ సీ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం
- ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర సమీక్ష
- డిజిటల్ సేవల విస్తరణకు వేగం పెంచాలని ఆదేశం



**హైదరాబాద్, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్ బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ఐటీఈ అండ్ సీ) శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జులై 1 నుంచి సంజయ్ జాజు తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐటీఈ అండ్ సీ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ ప్రాజెక్టులు, డిజిటల్ సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో సమాచార సాంకేతిక రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందిస్తున్న డిజిటల్ సేవలను విస్తరించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడుల ఆకర్షణ, ఐటీ రంగ విస్తరణ, ఈగవర్నెన్స్ కార్యక్రమాల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రతి ప్రాజెక్టుపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

పారదర్శకత, నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తూ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో సమాచార సాంకేతిక రంగం కీలక పాత్ర పోషిస్తోందని, ఆ దిశగా అధికారులు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని వివిధ ప్రాజెక్టుల పురోగతిని ప్రధాన కార్యదర్శికి వివరించారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం

- ఒకే రన్‌వేపై ఎదురెదురుగా వచ్చిన రెండు విమానాలు
- అప్రమత్తమైన పైలట్, నియంత్రణ కేంద్రంతో తప్పిన ప్రమాదం

**ముంబై, జులై 8 (తెలంగాణ ముచ్చట్లు):** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘోర విమాన ప్రమాదం తృటిలో తప్పింది. ఒకే రన్‌వేపై ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు విమానాలు ఎదురెదురుగా రావడంతో కొద్దిసేపు ఉత్కంఠ నెలకొంది. అయితే ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ కేంద్రం అప్రమత్తం కావడం, పైలట్ వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రెండు విమానాలు కొన్ని అడుగుల దూరంలోనే ఆగిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

విమానాశ్రయ అధికారుల వివరాల ప్రకారం, మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో సిలిగుడి నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం రన్‌వేపై దిగింది. అదే సమయంలో ముంబై నుంచి ఢిల్లీకి బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఎయిర్ ఇండియా విమానం అదే రన్‌వేపై ముందుకు కదిలింది. రెండు విమానాలు ఒకదానికొకటి ఎదురుగా వస్తున్న విషయాన్ని ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ కేంద్రం గుర్తించి వెంటనే పైలట్‌ను అప్రమత్తం చేసింది.

సమాచారం అందుకున్న ఎయిర్ ఇండియా విమాన పైలట్ వెంటనే విమానాన్ని నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. కొన్ని క్షణాలు ఆలస్యమైనా రెండు విమానాలు ఢీకొనే ప్రమాదం ఉండేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు జరగకపోవడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఘటన అనంతరం రెండు విమానాలను సాంకేతిక తనిఖీల కోసం నిలిపివేశారు. ఎయిర్ ఇండియా విమానాన్ని మరింత సాంకేతిక పరిశీలన కోసం నిర్వహణ కేంద్రానికి తరలించారు. ఆ విమానంలో ఉన్న ప్రయాణికులకు ప్రత్యామ్నాయ విమానాల్లో ప్రయాణ ఏర్పాట్లు చేసినట్లు విమానయాన సంస్థ వెల్లడించింది.

ఈ ఘటనకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తు ప్రారంభించినట్లు పౌర విమానయాన నియంత్రణ సంస్థ తెలిపింది. రన్‌వేపై రెండు విమానాలు ఒకేసారి ఎలా చేరుకున్నాయి, ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను విచారిస్తున్నారు. సంబంధిత అధికారుల నుంచి నివేదికలు కోరినట్లు వెల్లడించింది. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ముంబై ఒకటి కావడంతో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రన్‌వే నిర్వహణ, విమాన రాకపోకల సమన్వయం, భద్రతా విధానాలపై మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టనున్నట్లు విమానయాన వర్గాలు తెలిపాయి.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in